సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి

● ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



రాధకు సీఎం ఎల్‌వోసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చాదర్‌ఘాట్, మే 27 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా మారిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్‌లోని సాయినగర్‌కు చెందిన రాధకు మంగళవారం రూ.1.50లక్షల సీఎం ఎల్‌వోసీ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ పథకం పేదలకు ఒక వరమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: కార్పొరేటర్

సైదాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి తెలిపారు. ఏపీఏయూ కాలనీలో రూ.16 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. డివిజన్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించానని వివరించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మడిగల విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ప్రతినిధులు శ్యాంప్రసాద్, మట్టారెడ్డి, రాంకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న కాల్వ సుజాత

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత

చంపాపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత సూచించారు. చంపాపేటలోని నల్ల, ఎర్ర పోచమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం శ్రీమాత అన్నపూర్ణేశ్వరీ అన్నదాన ట్రస్ట్ చైర్మన్ దండేటికార్ భగవత్, మర్రి అరుంధతి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించడం సంతోషంగా ఉందని సుజాత అన్నారు. ఈ కార్యక్రమంలో 18చుక్కల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వేణుకుమార్, బీఆర్‌ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, ట్రస్ట్ సభ్యులు సంతోష్, సుశీల్‌కుమార్, రాజేశ్, రాజా, తిలక్‌రాజ్, శివ, వెంకటేష్, ఉపేంద్రచారి, శ్రీనివాస్‌నాయక్, సంతోష్‌రెడ్డి, శానవాజ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల పారబోతపై పోలీసులకు హైడ్రా ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 27 (ఆంధ్రజ్యోతి): కుంట్లూర్ పెద్ద చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణ వ్యర్థాలను పారబోసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైడ్రా వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్ మంగళవారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ పెద్దచెరువు వద్ద హైడ్రా వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్‌తో పాటు చరణ్‌తేజా, దుబ్బాక సతీష్ మంగళవారం విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఓ టిప్పర్‌లో డ్రైవర్ రామకృష్ణ నిర్మాణ వ్యర్థాలను తీసుకువచ్చి పెద్ద చెరువు బఫర్ జోన్‌లో పారబోస్తున్నాడు. గమనించిన హైడ్రా సిబ్బంది అక్కడికి వెళ్లి ఇక్కడ ఎందుకు పోస్తున్నావు అని డ్రైవర్‌ను ప్రశ్నించారు. ఈ భూమి తమదేనని డ్రైవర్ అన్నారు. ఇది చెరువు పరిధిలోకి వస్తుందని ఇక్కడ వ్యర్థాలను పారబోయకూడదని వారు డ్రైవర్‌కు సూచించారు. అనంతరం హైడ్రా ఇన్‌స్పెక్టర్ చెరువు బఫర్‌లో వ్యర్థాలు పారబోసిన వారిపై చట్టపరమైనా చర్యలు తీసుకోవాలని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జితేందర్

దేశానికి దశదిశ చూపిన నాయకుడు నెహ్రూ

● టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్

చంపాపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): దేశానికి దశదిశ చూపిన నాయకుడు నెహ్రూ అని టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ అన్నారు. టీపీసీసీ సేవాదళ్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీభవన్‌లో నెహ్రూ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ పూలమాల నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి నెహ్రూ చేసిన సేవలను గుర్తు చేశారు.

ఎస్ఎన్‌డీపీ పనులు వేగవంతం చేయాలి

చంపాపేట, మే 27(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లో ఏపీఎస్‌ఈబీ కాలనీ నుంచి బైరామల్‌గూడ చెరువు వరకు చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతనాయక్ మంగళవారం మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. వందనపురి కాలనీ నుంచి కేకేగార్డెన్ వరకు వరదనీటి కాలువ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆమె కోరారు. ద్వారకానగర్‌కాలనీ నుంచి డీఆర్‌డీఎల్ కాలనీ వరకు వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు.



ఎల్బీనగర్‌లో స్నిఫర్ డాగ్‌తో తనిఖీలు చేస్తున్న బాంబు స్క్వాడ్

ఎల్‌బీనగర్‌లో బాంబు స్క్వాడ్ తనిఖీలు

కొత్తపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం బాంబు స్క్వాడ్ బృందం ఎల్బీనగర్‌లో విజయవాడ బస్‌స్టాప్, రింగ్‌రోడ్డు, మెట్రో స్టేషన్ పరిసరాల్లో స్నిఫర్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించింది. హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, అప్పలరాజు, కానిస్టేబుల్ శివ పాల్గొన్నారు.

సుపరిపాలనకు ప్రతిరూపం.. అహల్యాబాయి

మన్సూరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు ప్రతిరూపంగా రాణి అహల్యాబాయి నిలిచిందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని పురస్కరించుకుని మన్సూరాబాద్ డివిజన్ సహారా స్టేట్స్‌లోని శివాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయంతి వేడుకల కన్వీనర్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, కోకన్వీనర్ గీతారెడ్డి, నాయకులు రామచంద్రయ్య, వివిధ డివిజన్ల బీజేపీ అధ్యక్షులు జయప్రకాశ్, ఆదినారాయణ, మైనారిటీ మోర్చా నాయకులు షకీల్‌మీర్జా, నాయకులు అమరేశ్ పాల్గొన్నారు.

యానిమేషన్‌తో ట్రాఫిక్ పాఠాలు



పార్కులోని లెక్చర్‌హాల్‌లో యానిమేషన్ వీడియో చూస్తున్న చిన్నారులు

చిన్నారులకు ట్రాఫిక్ శిక్షణ..

విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడానికి ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న ఈ ప్రత్యేక పార్కును సద్వినియోగం చేసుకోవచ్చు. పార్కు లెక్చర్ హాల్‌లో, ట్రాఫిక్ ఎడ్యుకేషన్ వ్యాన్‌లోనూ పిల్లలందరికీ ట్రాఫిక్ నిబంధనలపై 10-15 నిమిషాల నిడివితో తయారు చేసిన వీడియోలు, యానిమేషన్ చిత్రాలు ప్రదర్శిస్తూ, డ్రైవింగ్ స్కిల్స్‌నూ సిమ్యులేటర్ ద్వారా వివరిస్తున్నారు. బైకులు నడిపే వారు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు వాడకం, మద్యం తాగి నడిపితే జరిగే అనర్థాలను వివరిస్తున్నారు. అదే విధంగా పార్కు ప్రహరీ లోపలి భాగంలో ట్రాఫిక్ ఎడ్యుకేషన్ చిత్రాలు, ట్రాఫిక్ లైట్లు, సిగ్నల్ గుర్తుల నమూనాలు ఏర్పాటు చేశారు. అనంతరం టీటీఐ అధికారులు నిబంధనలపై ప్రశ్నలు - జవాబులతో పిల్లలు అభిప్రాయాలను వెల్లడించే వీలు కల్పిస్తున్నారు. అంతేగాక చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు కూడా నిర్వహిస్తున్నారు.

● అల్కాపూర్‌లో ట్రాఫిక్ ట్రైనింగ్ పార్కు

● పదహారేండ్ల క్రితం ఏర్పాటు

● చిన్నారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కొత్తపేట, మే 27(ఆంధ్రజ్యోతి): అదీ ఓ పార్కే.. కానీ అలసిపోయిన వాళ్లు సేదదీరడానికి కాదు. పిల్లలు ఆడుతూ పాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పార్కు. పిల్లలందరికీ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తే ప్రమాదాలను కొంతైనా తగ్గించవచ్చనే యోచనతో చిల్డ్రన్ ట్రాఫిక్ ట్రైనింగ్ పార్కు ఏర్పడింది. పదహారేండ్ల క్రితం అల్కాపురి చౌరస్తా సమీపంలో ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కన మ్యూజెస్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ వారి సహకారంతో పిల్లల ట్రాఫిక్ ట్రైనింగ్ పార్కు ఏర్పాటు చేశారు. అప్పటి హోంశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి దీన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి అది పిల్లలకు ట్రాఫిక్ నిబంధనలపై శిక్షణ అందిస్తూ అందరి మన్ననలు పొందుతోంది.



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి



పార్కులో సైకిళ్లు తొక్కుతున్న చిన్నారులు

దరఖాస్తు ఇలా..

ట్రాఫిక్ నిబంధనలపై పిల్లలకు అవగాహన కల్పించాలనుకునే వారు ముందుగా శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్సులో గల రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా 8712534838, 8712662461 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించవచ్చని టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు.

పిల్లలకు ట్రాఫిక్ నిబంధలపై అవగాహన



రాచకొండ సీపీ సుధీర్‌బాబు మార్గదర్శకంలో పిల్లలకు మరింత మెరుగ్గా ట్రాఫిక్ నిబంధనలు పరిచయం చేస్తున్నాం. చిల్డ్రన్స్ ట్రాఫిక్ ట్రైనింగ్ పార్కులో సైకిళ్లు, బ్యాటరీ కారు వాడుతూ నిబంధనల ప్రాధాన్యతను వివరిస్తున్నాం. హీరో మోటో కార్ప్ వారు, ట్రాఫిక్ అధికారులు తయారు చేసిన ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ ఫర్ చిల్డ్రన్- పుస్తకాలు, కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఏ పాఠశాల వారైనా ట్రాఫిక్ పార్కును సందర్శించవచ్చు.

- శ్రీనివాసులు, డీసీపీ, ట్రాఫిక్ జోన్-2, రాచకొండ

ప్రతీ డివిజన్‌లో ఫ్రీ మాన్‌సూన్ క్లీనప్ కార్యక్రమం

● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

● ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి

ఎల్‌బీనగర్, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రతీ డివిజన్‌లో ఫ్రీ మాన్‌సూన్ క్లీనప్ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ అధ్యక్షతన హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కార్పొరేటర్లు పలు అంశాలను ప్రస్తావించి తగు చర్యలు చేట్టాలని మేయర్‌ను కోరారు. కార్పొరేటర్లు ప్రస్తావించిన అంశాలపై మేయర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఫ్రీ మాన్‌సూన్ క్లీనప్ కార్యక్రమం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. నగరంలో వీధి దీపాల నిర్వహణపై బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి ఒక నిర్ణయం తీసుకోనున్నామని మేయర్ చెప్పారు. ఎన్ఓసీలను జీహెచ్ఎంసీ నేరుగా వారి నుంచి తెప్పించుకుని ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌లను జారీ చేయాలని కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మేయర్, జోనల్ కమిషనర్ సమాధానమిచ్చారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు పవన్‌కుమార్, నరసింహగుప్తా, సుజాతానాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లచ్చిరెడ్డి, ఆకుల శ్రీవాణి, చింతల అరుణ, సురేందర్‌యాదవ్, ఎస్ఈ అశోక్‌రెడ్డి, సీపీ శ్రీనివాస్‌యాదవ్, ఉపకమిషనర్లు యాదయ్య, సేవా ఇస్లావత్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు కట్టించాలి: రవీంద్రాచారి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైనా పేదలందరికి స్థలంతో పాటు ఇంటిని నిర్మించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ రాజీవ్ గృహకల్పలో సీపీఐ శాఖ కార్యదర్శి రాములు అధ్యక్షతన మంగళవారం మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి హాజరై పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్న పేదల రాతలు మారడం లేదన్నారు. ఎన్నికల హామీలపై ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆపరేషన్ కగార్‌ను ప్రభుత్వాలు వెంటనే ఆపి వారితో చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హరిసింగ్‌నాయక్, యాదయ్య, గణేశ్, రాము, వెంకట్, బాబు, వలీ, నరసింహ, శ్రీను, హుస్సెన్ పాల్గొన్నారు.

జడ్పీ రోడ్‌లో ఆర్టీసీ బస్సులు నడపాలి

● బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్

చంపాపేట, మే 27(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ జడ్పీ రోడ్‌లో ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్‌గౌడ్ మంగళవారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ నర్సప్పకు వినతిపత్రం అందజేశారు. ఇబ్రహీంపట్నం నుంచి కోఠీ, ఐఎస్‌సదన్, బస్‌డిపో మధ్య నడిచే ఆర్టీసీ బస్సులు బీఎన్‌రెడ్డి చౌరస్తా నుంచి తెలంగాణ చౌరస్తా అగ్రికల్చర్‌కాలనీ, శ్రీరమణకాలనీ, భూపేష్ గుప్తానగర్, టీకేఆర్ కమాన్ మీదుగా వెళ్లాలని డీఎంను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవరెడ్డి, గజ్జల రాజుగౌడ్, గౌని వెంకటేష్‌గౌడ్, బొమ్మిడి కిరణ్‌రెడ్డి, శశిదర్‌రెడ్డి, సోమిరెడ్డి, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేంద్రయాదవ్, మల్లేష్‌యాదవ్, పవనీత్ తదితరులు పాల్గొన్నారు.

కృషినగర్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక

మన్సూరాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ బండ్లగూడ పరిధిలోని కృషినగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రతాప్, గౌరవాధ్యక్షుడిగా సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా నరేశ్‌కుమార్, కార్యదర్శిగా సహదేవ్‌గౌడ్, ప్రధానకార్యదర్శులుగా రామిరెడ్డి, కౌశిక్, జనార్దన్‌రెడ్డి, గంగా భవానీ, కోశాధికారిగా వెంకటరెడ్డి, సహాయ కోశాధికారిగా రాజేంద్ర, తదితరులు ఎన్నికయ్యారు. అందరి సహకారంతో కాలనీ అభ్యున్నతికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు ప్రతాప్ తెలిపారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగియుండాలి

● డీఎస్ఐ శివశంకర్

సైదాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ రాజ్యాంగం కల్పించిన చట్టాలపై అవగాహన కలిగియుండాలని డీఎస్ఐ శివశంకర్ అన్నారు. మాదవనగర్‌లో సైదాబాద్ పోలీసులు, మహిళ భద్రతా విభాగం సీఈడబ్ల్యూ ఆధ్వర్యంలో మహిళలకు గృహహింసపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహహింస జరగడానికి కారణాలు, రాజీ కుదుర్చుకునేందుకు చేపట్టాల్సిన చర్యలను ఆయన తెలిపారు.

వేయని రోడ్డుకు బిల్లులపై జీహెచ్ఎంసీ విచారణ

సైదాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి వాంబే కాలనీలో వేయని సీసీ రోడ్డుకు బిల్లులు కాజేసినా వైనంపై జీహెచ్ఎంసీ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. కమిషనర్ ఆదేశాలతో ఆరుగురు అధికారుల బృందం మంగళవారం పర్యటించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. సీసీ రోడ్డు వేయలేదని చెప్పినా బస్తీవాసుల నుంచి అధికారుల వాంగ్మూలం రికార్డు చేశారు. నివేదికను తయారు చేసి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు సమర్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం

● కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్

రాయదుర్గం, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం కొనసాగుతుంటే భారత్ అన్ని రంగాల్లో స్థిరమైన పురోగతి సాధిస్తుందని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి.అనంత నాగేశ్వరన్ అన్నారు. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ, జాతీయ గణాంకాల కార్యాలయం, ఐఎస్‌బీ, ఇన్‌కార్పోరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తాధ్వర్యంలో 2023-24 వార్షిక సర్వే డేటా ఫలితాలపై మంగళవారం ఐఎస్‌బీలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. తయారీ రంగంలో పటిష్టమైన మూల ధన వ్యయంతో సంస్థలు, మహిళా వ్యవస్థాపక వృద్ధిలో పురోగతి సాధిస్తుందన్నారు. ఇన్ కార్పొరేటెడ్, వ్యవసాయేతర రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధిస్తున్నామని ఈ సర్వే గణాంకాల డేటా వెల్లడిస్తుందన్నారు. ఐఎస్‌బీ డీన్ మదన్ పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో కేకు కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండి పోయే జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. చదువుకునే రోజుల్లో ఆడిన ఆటలు, చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ 35ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకున్నారు. అందుకు గండిమైసమ్మ ఆలయం వద్ద గల ఫంక్షన్ హాల్ వేదికైంది. పెద్దఅంబర్‌పేట్ జడ్పీహెచ్ఎస్‌లో 1989-90 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా 35 ఏళ్ల క్రితం స్కూల్‌లో చేసిన అల్లరి, మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. 35 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులందరిని కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 40 మంది పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న

● ఉప్పల శ్రీనివాస్‌గుప్త

కొత్తపేట, మే 27(ఆంధ్రజ్యోతి): అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న అని అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. మంగళవారం కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో ఐవీఎఫ్ మహిళా విభాగ్ అధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆకలి తీర్చడంలో ఎనలని ఆనందం ఉంటుందని ఆయన అన్నారు. ప్రతీ అమావాస్యకూ అన్నప్రసాద వితరణ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, అధ్యక్షురాలు మంజుల, నళిణిమనిమాల, అర్చన, లలిత, సరిత, పద్మజ, దాక్షాయణి పాల్గొన్నారు.

'పాఠశాలలపై చర్యలు తీసుకోండి'

హయత్‌నగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ కుంట్లూర్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రవీంద్రభారతి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరిగౌడ్ ఎంఈఓను కోరారు. ఈ మేరకు మంగళవారం హయత్‌నగర్ మండల విద్యాధికారికి ఆయన ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా శ్మశాన వాటిక పక్కన ఉన్న పాఠశాలను సీజ్ చేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో జిల్లా విద్యా కార్యాలయం ముందు ధర్నా చేస్తానని ఆయన హెచ్చరించారు.

'ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడిని అడ్డుకోండి'

సైదాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడిని అడ్డుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం ప్రతినిధులు కార్పొరేటర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. సంఘం ప్రతినిధులు షేక్ మహామూద్, సాయిలక్ష్మి, సంతోషి, పాల్గొన్నారు.

29 నుంచి వికసిత్ సంకల్ప్ అభియాన్

సంతోష్‌నగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ఈ నెల 29 నుంచి ప్రారంభమవుతుందని సంతోష్‌నగర్ ఐసీఏఆర్-సెంట్రల్ డ్రైలాండ్ వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ వీకే సింగ్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలోని 700కి పైగా జిల్లాల్లో ప్రచారం కొనసాగుతుందని ఆయన తెలిపారు.



చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయాన్ని మంగళవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను సత్కరించారు.

- చంపాపేట, ఆంధ్రజ్యోతి

ఆటోల దొంగ అరెస్ట్



నిందితుడు రవీందర్

చాదర్‌ఘాట్, మే 27 (ఆంధ్రజ్యోతి): డూప్లికేట్ తాళాలతో ఆటోలను దొంగిలించే పాత నేరస్థుని చాదర్‌ఘాట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. చాదర్‌ఘాట్ ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామంలోని జయరాం తండాకు చెందిన నైనావత్ రవీందర్ అలియాస్ రవి (31) కొంత కాలంగా మిధాని డిపో సమీపంలోని హట్స్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 24న మలకపేట వల్లభ్‌లో ఇంటి ముందు పార్క్ చేసిన ఆటోను డూప్లికేట్ తాళంతో ఆన్ చేసి దొంగిలించాడు. సమాచారం తెలుసుకున్న చాదర్‌ఘాట్ క్రైం పోలీసులు నిఘా వేసి రవీందర్‌ను పట్టుకున్నారు. అనంతరం అతణ్ణి విచారించగా చేసిన నేరం ఒప్పుకున్నాడు. అతనిపై పలు పోలీస్‌స్టేషన్లలో 14 ఆటో దొంగతనం కేసులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అనంతరం రవీందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గోడకేసి కొట్టి.. ఆపై గొంతు నులిమి..

● భర్తను హత్య చేసిన భార్య



కిషన్ (ఫైల్)

వనస్థలిపురం, మే 27(ఆంధ్రజ్యోతి): భర్తను గోడకేసి కొట్టి.. ఆపై గొంతు నులిమి హత్య చేసిందో మహిళ. అనంతరం ప్రమాదవశాత్తూ చనిపోయాడని పోలీసులతో సహా అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వనస్థలిపురం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం బావత్ తండాకు చెందిన ఆటో డ్రైవర్ సభావత్ కిషన్ నాయక్(40)కు కళతో 2005లో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. మొదటి భార్య మృతి చెందడంతో పిల్లలు ముగ్గురూ అమ్మమ్మ వద్ద ఉంటున్నారు. కిషన్ నాయక్ నగరానికి వచ్చి ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇలా ఉండగా, యాదాద్రి -భువనగిరి జిల్లా గోకారం గ్రామానికి చెందిన శిరీషకు భర్తతో మనస్పర్థలు రావడంతో 2015లో విడాకులు తీసుకుంది. ఈమెకు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న కిషన్ నాయక్‌తో పరిచయం ఏర్పడటంతో 2015లో రెండో వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అమ్మమ్మ దగ్గర ఉంటున్నారు. భార్యాభర్తలు కిషన్‌నాయక్ గ్రామంలో వ్యవసాయం చేసుకొనేవారు. ఈ క్రమంలో శిరీషకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కిషన్‌నాయక్ భార్యను మందలించడంతో గొడవలు జరిగాయి. ఈ క్రమంలో రెండు నెలల క్రితం వనస్థపురంలోని హిల్‌కాలనీకి మకాం మార్చారు. కిషన్ నాయక్ సోమవారం సాయంత్రం మద్యం తాగి తన భార్య పనిచేసే చోటికి వెళ్లి ఆమెతో గొడవపడి ఇంటికి తీసుకొచ్చాడు. మరోసారి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తనపై అనుమానం వ్యక్తం చేయడమే కాకుండా ఆఫీసుకొచ్చి గొడవపడడ్డని కోపోద్రిక్తురాలైన శిరీష భర్త కిషన్‌నాయక్‌ను గట్టిగా గోడకేసి కొట్టింది. తర్వాత గొంతు నులిమి హత్య చేసింది. అనంతరం అంబులెన్స్‌లో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లింది. కిషన్‌నాయక్‌కు పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఇలా ఉండగా, కిషన్ నాయక్ మొదటి భార్య కూతురు బిందు తన తండ్రిని శిరీష చున్నీతో హత్య చేసిందని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు శిరీషపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 27 (ఆంధ్రజ్యోతి): యూటర్న్ తీసుకుంటున్న స్కూటీని లారీ ఢీకొట్టింది. స్కూటీపై ఉన్న వ్యక్తి కింద పడడంతో తీవ్ర గాయాలైనా సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వట్టిపాక అశోక్ రామోజీఫిల్మ్ సిటీలో పని చేస్తాడు. మంగళవారం ఉదయం 5.40 గంటలకు తన స్కూటీపై ఫిల్మ్‌సిటీకి వెళ్తున్నాడు. యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో చౌటుప్పల్ వైపు నుంచి వచ్చిన లారీ అశోక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు స్కూటీపై నుంచి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.